సాక్షి
వరంగల్
గురువారం । 15 । జూన్ । 2023



పర్యవేక్షణ.. నిరీక్షణ
కేయూలో మూడు కీలక పోస్టులు ఖాళీ అయినా అధికారులు భర్తీ చేయకుండా జాప్యం చేస్తున్నారు.
- 4లో▸



బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు.
- 4లో▸

గరిష్టం/కనిష్టం
42^0 / 30^0

వాతావరణం
జిల్లాలో వేడి అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో తీవ్రమైన ఎండలతోపాటు వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీట్‌లో రిషికేశ్‌రెడ్డి ప్రతిభ



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన చెన్నూరి రిషికేశ్‌రెడ్డి నీట్‌లో సత్తా చాటాడు. చెన్నూరి కిరణ్‌రెడ్డి–విజయలక్ష్మి కుమారుడు రిషికేశ్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా 35,652వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆల్ ఇండియా 4,667వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన రిషికేశ్ మొదటి ప్రయత్నంలోనే 720 మార్కులకు 589 మార్కులు సాధించి మెడిసిన్ సీటును ఖాయం చేసుకున్నాడు. ఈ మేరకు పలువురు గ్రామస్తులు బుధవారం ఆయనను అభినందించారు. ఇదిలా ఉండగా గత దశాబ్దం నుంచి ప్రతీ సంవత్సరం గ్రామంలోని పలువురు విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధిస్తూనే ఉన్నారు.

223 మంది గైర్హాజరు

కాశోజీ సెంటర్: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 223 విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 2,415 మంది విద్యార్థులకు 2,240 మంది హాజరు కాగా.. 175 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రెండో సంవత్సరం పరీక్షకు మొత్తం 1,174 మంది విద్యార్థులకు 1,126 మంది హాజరు కాగా.. 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు.

'టెన్త్'లో 25 మంది గైర్హాజరు

కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించగా.. జిల్లాలో 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 381 మంది విద్యార్థులకు 356 మంది హాజరవ్వగా.. 25 మంది గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు.

కొలన్‌పల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయపర్తి: మండలంలోని కొలన్‌పల్లి గ్రామంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామలింగేశ్వర, సీతారామలక్ష్మణ హనుమత్, సుబ్రహ్మణ్య, నవగ్రహ, పంచముఖ ఆంజనేయ, గణపతి, నంది, ధ్వజశిఖర ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ ఆలకుంట రాజేందర్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

కాశిబుగ్గ: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎంజీఎంలో వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ డొనేషన్ శిబిరాన్ని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. ఈశిబిరంలో మొత్తం 70 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యులు తెలిపారు. హాస్పిటల్ ఆర్ఎంఓలు మల్లికార్జున్, డాక్టర్ మురళి, దిలీప్, ప్రసాద్ వివిధ విభాగాధిపతులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత ఓటరు జాబితా రూపొందించాలి

కరీమాబాద్: అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించి, రెండో విడత ఓటరు జాబితా రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఆయన బుధవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి పూర్తి వివరాలతో జిల్లా ప్రొఫైల్‌ను రూపొందించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ కోసం భారత ఎన్నికల కమిషన్ ఈనెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందని, ఇందుకోసం పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డీజీపీ అంజనీకుమార్‌యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీవాకడే, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, డీసీపీ కరుణాకర్ పాల్గొన్నారు.

తవ్వుడు.. తరలించుడు

జిల్లాలో రూ.కోట్లలో రేగడి మట్టి వ్యాపారం

- ఇందుకోసం ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువు ఖాళీ
- 300 ఎకరాల్లోని సరస్సు నీరు బయటకు..
- గీసుగొండ, సంగెం, నెక్కొండలోనూ దందా
- ప్రజాప్రతినిధులే మధ్యవర్తులుగా వ్యాపారం



వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువు నుంచి రేగడి మట్టిని తరలిస్తున్న టిప్పర్

సాక్షి, వరంగల్: ఇటుక బట్టీలకు అవసరమయ్యే రేగడి మట్టి కోసం చెరువులను చెరబడుతున్నారు. అవసరమైతే వాటిలో ఉన్న నీటిని బయటకు పంపించి మరీ దర్జాగా మట్టిని తోడేస్తున్నారు. అనుమతి లేకుండానే కొన్ని.. అనుమతి ఉందంటూ లెక్కకు మించి తోడేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రతి ఏటా వేసవిలో జరుగుతున్న ఈ మట్టి దోపిడీ గురించి ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఫలితంగా సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. ముఖ్యంగా వర్ధన్నపేట, గీసుకొండ, సంగెం, నెక్కొండ మండలాల్లో దీనిని నియంత్రించేవారు కరువయ్యారు. ఫలితంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులే మధ్యవర్తులుగా రూ.కోట్లలో ఈ మట్టి దందా జరుగుతోందన్న ప్రచారం ఉంది.

300 ఎకరాల్లోని ఎల్లమ్మ చెరువును ఖాళీ చేయించి..

వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలోని 300 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎల్లమ్మ చెరువులో నీటిని వదిలి ఖాళీ చేశారు. దాదాపు వారంపాటు అందులో నీటిని మే నెలాఖరులో బయటకు పంపిన అక్రమార్కులు.. ఇప్పుడు మట్టిని తోడేస్తున్నారు. పంచాయతీ తీర్మానం చేసి మరీ ఈ చెరువు నుంచి నీటిని తోడుకోవచ్చంటూ నీటి పారుదల శాఖ అధికాకారులకు పంపిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాత్రి వేళ మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అన్ని అనుమతులు ఉంటే రాత్రి వేళ రేగడి మట్టిని తరలించాల్సిన అవసరం ఏముందని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోజుకు దాదాపు 15 లారీలు వరంగల్ నగర శివారులోని నక్కలపల్లిలో ఉన్న ఇటుకబట్టీలకు 50 ట్రిప్పులకుపైగానే తరలించి విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రిప్పునకు రూ.15 వేలకు పైగానే విక్రయిస్తూ సరాసరి 50 ట్రిప్పులకు లెక్కన వేసుకున్నా రూ.7,50,000పైనా దందా సాగుతోందని తెలుస్తోంది. ఈ దందా వారం రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. ఇప్పటి వరకు రూ.50 లక్షలకుపైగానే వ్యాపారం జరిగిందని తెలుస్తోంది.

ఇతర మండలాల్లోనూ...

గీసుగొండ మండలం ఊకల్ చెరువులో మట్టిని తోడేందుకు అనుమతి తీసుకున్నామని చెబుతున్నా.. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ రేగడి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మొరాన్ని కైటెక్స్ కంపెనీ పనుల కోసం తరలిస్తున్నామని చెబుతున్నా నిబంధనలను ఉల్లంఘించి ఈ దందా సాగుతోందనే ఆరోపణలున్నాయి. సంగెం మండలం తీగరాజుపల్లి శివారులో దాదాపు నెలరోజులపాటు రేగడి మట్టిని తీసి ఇటుకబట్టీలకు తరలించిన ముఠా అనుమతి లేకుండానే ఈ దందా చేసిందని తెలుస్తోంది. నెక్కొండ మండలంలోనూ ఓ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిని తోడేసి అమ్ముకుంటున్నారన్న స్థానికులు చర్చించుకుంటున్నారు. పర్వతగిరి మండలం ఏనుగల్లు సమీపంలోని ఓ తండా చెరువులోనూ మట్టి తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నాయి. అలాగే, రాయపర్తి మండలం కొత్తూరు చెరువులోనూ మట్టిని తరలిస్తున్నారు. ఇది గ్రామంలో చేపట్టిన జరుగుతున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనుల కోసమంటూ అక్కడి నాయకులు చెబుతున్నారు. మట్టి తవ్వకాలపై వివరణ కోసం సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వర్ధన్నపేట: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేటలో పట్టణ ప్రగతి పనులను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సమీకృత మార్కెట్, డీసీతండా, పట్ట ణంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నిర్మించిన మోడల్ వైకుంఠధామ పనులు 70శాతం పూర్తయ్యాయని,మిగిలిన పనులు వచ్చేనెల 17వరకు పూర్తి చేయా లని ఆదేశించామన్నారు. డీసీ తండాలో కోటి రూపాయలతో మినీ ఫంక్షన్‌హాల్,రూ.2.25 కోట్లతో చేపట్టిన మున్సిపల్ భవన నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. వచ్చేనెల 5 వరకు పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్‌ను ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు. సంగెపు వాగు వద్ద నిర్మించిన వైకుంఠధామంలో వసతులు కల్పించాలని చెప్పారు.సమీకృత మార్కెట్‌ను వచ్చేనెల 30 వరకు పూర్తి చేసి ప్రారంభానికి ఏర్పా ట్లు చేయాలన్నారు.కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీందర్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ గుడ్లపై ముద్రలు

మూడు రంగుల్లో పంపిణీ

- పక్కదారి పట్టకుండా చర్యలు
- జిల్లాలో 919 అంగన్‌వాడీ కేంద్రాలు
- 55, 878 మంది లబ్ధిదారులు



అంగన్‌వాడీ కేంద్రాలకు ముద్రలతో వచ్చిన కోడిగుడ్లు

ఖానాపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఈక్రమంలో పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా నూతన విధానాన్ని తీసుకొచ్చింది. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 55, 878 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో గర్భిణులు, బాలింతలు 10, 831 మంది, మిగిలిన వారు చిన్నారులు ఉన్నారు. 45, 222 మందికి కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. కోడిగుడ్లను లబ్ధిదారులకు సరిగా అందించకపోవడం, లబ్ధిదారులు కేంద్రాలకు వచ్చి తీసుకెళ్లకపోవడం, తీసుకెళ్లిన కోడిగుడ్లను ఇతరులకు అప్పగించడం వంటి సంఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకం కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా, నాసిరకంగా ఉండకుండా, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేవిధంగా చర్యలు చేపట్టింది. కాంట్రాక్టర్లు సరఫరా చేసే కోడిగుడ్లపై జూన్ మొదటి వారం నుంచి ముద్రలు వేస్తున్నారు. మొదటి దఫా వచ్చిన కోడిగుడ్లకు నీలిరంగు, రెండో దఫా వచ్చిన వాటికి ఎరుపు, మూడో దఫా వచ్చిన గుడ్లకు ఆకుపచ్చ రంగు ముద్రలు వేసి పంపిణీ చేస్తున్నారు. కోడిగుడ్లను ఇక పక్కాగా గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు. కోడిగుడ్లపై ముద్రలు లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

బడ్జెట్‌లో అధిక నిధులు వైద్యానికే..

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

నర్సంపేట: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో అత్యధిక భాగం వైద్య రంగానికే ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అనేక ఆస్పత్రులను నిర్మించి అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి, ఖరీదైన ఉచిత వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. నర్సంపేట పట్టణంలో రూ.70 కోట్లతో 130 రకాల టెస్టులతో కూడిన జిల్లా ఆస్పత్రి నిర్మాణం చివరి దశలో ఉందని, 57 రకాల టెస్టులకు సంబంధించిన డయాగ్నస్టిక్ సెంటర్ సైతం అందుబాటులోకి రానుందన్నారు. సీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీల ద్వారా 10 వేల మంది లబ్ధిదారులకు రూ.60 కోట్లు అందించినట్లు తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ ప్రకాశ్, డాక్టర్ మనోజ్ లాల్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి ఎంచుకోవాలి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



గ్రామ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: గ్రామీణ ప్రాంతాల మహిళలు స్వ యం ఉపాధిని ఎంచుకోవాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రాగంపేట రైతు ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు సాయి స్వచ్ఛంద సంస్థ, నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రామ దుకాణాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో 36 వేల మందికి పైగా రైతులు ఉత్పత్తిదారుల సంఘాల్లో ఉన్నారన్నారు. నర్సంపేటలో ఏర్పడిన రైతు సంఘాలు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తాయన్నా రు. ఎఫ్‌పీఓలకు నాబార్డ్ సహకారం అవసరమని, బ్యాంకుల సహకారాన్ని ఎఫ్‌పీఓలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు రుణాల కోసం చూడకుండా సొంతంగా వ్యాపారాలను ప్రా రంభించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జేడీఏ ఉషాదయాళ్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఏజీఎం రవికిరణ్, ఏడీఏ అవినాష్‌వర్మ, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, సాయి స్వచ్ఛంద సంస్థ సీఈఓ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓ సంతోష్, ఎంపీటీసీలు కవిత, సర్పంచ్‌లు బాషబోయిన ఐలయ్య, చిరంజీవి, ఏపీఎం సుధాకర్, శిరీష పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట: పేదలకు నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వర్ధన్నపేటలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవంలో కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార కిట్‌లు పంపిణీ చేసి ఎమ్మెల్యే అరూరి మాట్లాడారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల నుంచి 60 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసుకున్నట్లు వివరించారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ 2014కు ముందు వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉండేవని పేర్కొన్నారు. రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, వర్ధన్నపేట, ఐనవోలు ఎంపీపీలు అన్నమనేని అప్పారావు, మార్నేని మధుమతి, డాక్టర్ గోపాల్‌రావు పాల్గొన్నారు.

17న టెక్స్‌టైల్ పార్కుకు మంత్రి కేటీఆర్ రాక

- దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీ పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



యంగ్‌వన్ కంపెనీ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ: జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కార్పొరేషన్ (కంపెనీ) నిర్మిస్తున్న వస్త్రపరిశ్రమ పనులకు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 17న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో కలిసి బుధవారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి టెక్స్‌టైల్ పార్కులో యంగ్ వన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా సభాస్థలి, శంకుస్థాపన చేసే ప్రాంతం, పార్కింగ్ తదితర ఏర్పాట్ల గురించి టీఎస్ఐఐసీ, పోలీసు అధికారులతో చర్చించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కేఎంటీపీలో దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీకి 298 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, రూ.840 కోట్ల పెట్టుబడి లక్ష్యంగా కంపెనీ తమ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కంపెనీ ద్వారా సుమారు 12 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కంపెనీ క్రీడలకు సంబంధించిన సింథటిక్ జాకెట్లు, బూట్లు, ట్రాక్‌సూట్లు, ట్రెక్కింగ్‌లో వాడే వస్తువులు, మ్యాట్లు తయారు చేస్తుందన్నారు. మంత్రి కేటీఆర్ ఉదయం 10 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేఎంటీపీకి చేరుకుంటారు. పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కంపెనీ ప్రతినిధులతో కలిసి మాట్లాడతారన్నారు. యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్‌సంగ్, కొరియన్ అంబాసిడర్ ఛాంగ్ జాబాక్, కంపెనీ ప్రతినిధులు ఎండీ.షాహజహాన్, మిన్సుక్‌లీ, జియాంగ్‌సూకిమ్, ఫెర్దోస్‌మిరిదా, దిలిప్‌చౌదరి తదితరులు మరో హెలికాప్టర్‌లో వస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. మామునూరు ఏసీపీ కృపాకర్, సీఐలు సట్ల రాజు, శ్రీనివాస్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ఎలుకుర్తి సర్పంచ్ పూంద్రు జయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిరిసె శ్రీకాంత్, కోట ప్రమోద్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ రంగనాథ్

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ రంగనాథ్ టెక్స్‌టైల్ పార్కులో పరిశీలించారు. హెలిపాడ్, సభాస్థలి, వీవీపీ వాహనాల పార్కింగ్ తదితర విషయాలను పోలీసు అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. టీఎస్ఐఐసీ జెడ్ఎం సంతోష్‌కుమార్, ఈస్ట్ జోన్ డీసీపీ పి.కరుణాకర్, మామునూరు ఏసీపీ కృపాకర్, గీసుకొండ, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్లు సట్ల రాజు, శ్రీనివాస్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఎంపీటీసీ వీరారావు పాల్గొన్నారు.

అమ్మకానికి సేంద్రియ ఎరువు

- తడి, పొడి చెత్తతో మరియపురంలో ఉత్పత్తి
- కిలోకు రూ.10 చొప్పున విక్రయం
- ఇప్పటి వరకు రూ.1.30 లక్షల ఆదాయం

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామం మరియపురం సేంద్రియ ఎరువు తయారీలో ముందు ఉంది. గ్రామంలో పోగు చేసిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులో వేరు చేస్తున్నారు. కేవలం తడి చెత్తను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గడుల్లో వేసి, వాన పాములతో తయారైన వర్మీ కంపోస్టు ఎరువుతో గ్రామపంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతోందని సర్పంచ్ అల్లం బాలిరెడ్డి తెలిపారు. ఇలా తయారైన సేంద్రియ ఎరువును ప్రత్యేకంగా రూపొందించిన సంచుల్లో నింపి రైతులు, కూరగాయలు, పూల మొక్కలు సాగుచేసే వారికి అమ్ముతున్నారు. ఈ ఎరువులో పోషక విలువలు అధికంగా ఉన్నాయని వ్యవసాయ పరిశోధన విభాగం అధికారులు ధ్రువీకరించారు. కిలో సేంద్రియ ఎరువుకు రూ.10 ధర నిర్ణయించినట్లు సర్పంచ్ తెలిపారు. ఇప్పటి వరకు సేంద్రియ ఎరువు అమ్మకం ద్వారా గ్రామ పంచాయతీకి రూ.1.30 లక్షల ఆదాయం వచ్చిందని, ప్రస్తుతం టన్ను ఎరువు అమ్మకానికి అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి పీజీ విద్యార్థులకు తరగతులు

● అధ్యాపకులకు ముగిసిన సెలవులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల సెలవులు బుధవారంతో ముగిశాయి. ఈనెల 15వ తేదీ నుంచి పీజీ రెండో సెమిస్టర్, 4వ సెమిస్టర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించాల్సింటుంది. న్యాక్ పేరుతో గత నెలలో విద్యార్థులకు సెలవులు ఇచ్చి అధ్యాపకులు విధుల్లో ఉన్నారు. గత నెల 25, 26, 27 తేదీల్లో న్యాక్‌టీం పర్యటిన ముగిసిన అనంతరం ఈనెల 4 నుంచి 14వ తేదీ వరకు అధ్యాపకులకు సెలవులు ఇస్తున్నట్లు వర్సిటీ అధికారులు ప్రకటించారు. దీంతో 4వ సెమిస్టర్, రెండో సెమిస్టర్ విద్యార్థులకు సరిగా సిలబస్ కాలేదు. ఇక పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ విద్యార్థులకు జూలై 5వతేదీ నుంచి పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఈమేరకు పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే టైంటేబుల్‌ను విడుదల చేశారు. కాగా, న్యాక్‌పేరుతో కొంత కాలంగా యూనివర్సిటీ అధికారులు క్లాస్‌లపై సరిగా దృష్టిసారించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దృష్టిసారిస్తారా లేదా అనే విషయం చూడాలి.

వడదెబ్బతో ఒకరి మృతి


సాంబయ్య(ఫైల్)

చెన్నారావుపేట: వడదెబ్బతో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన మర్రి సాంబయ్య (65) ఈ నెల 12వ తేదీన గ్రామంలోని తమ కులస్తుడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురయ్యాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు గమనించి నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బాలుడి మృతదేహం లభ్యం

మంగపేట: మండలంలోని కమలాపురం ఇన్‌టెక్ వెల్ వద్ద గోదావరి నదిలో గల్లంతైన కొంగర ఈశ్వర్‌ప్రసాద్(14) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావుపేటకు చెందిన కొంగర ఈశ్వర్ తన బంధువులతో కలిసి మంగళవారం గోదావరిలో స్నానం చేస్తూ గల్లంతైన విషయం విదితమే. పోలీసులు జాలర్లతో అదేరోజు రాత్రి వరకూ గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం బాలుడి మృతదేహం లభ్యమైంది. శవ పంచనామా నిర్వహించి మృతుడి తల్లి భ్రమరాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే తాహెర్ బాబా తెలిపారు.

పర్యవేక్షణ..నిరీక్షణ

● కేయూలో మూడు కీలక పోస్టుల నియామకంలో జాప్యం
● కుంటుపడుతున్న యూనివర్సిటీ అభివృద్ధి
● ఫార్మసీ కళాశాల డీన్ పోస్టు వద్దన్నా కొనసాగింపు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మూడు కీలక పోస్టులు ఖాళీ అయ్యాయి. అయినా అధికారులు భర్తీ చేయకుండా జాప్యం చేస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కరువై యూనివర్సిటీ నిర్వహణ కుంటుపడుతోంది. కేయూలో అభివృద్ధి అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన తెలుగు విభాగం ఆచార్యుడు పంతంగి వెంకటేశ్వర్లు గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. 14 రోజులు గడిచినా ఈ పోస్టును భర్తీ చేయడం లేదు. ఫలితంగా వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించే వారే కరువయ్యారు. అలాగే, పరీక్షల విభాగంలో డిగ్రీ సెక్షన్‌లో అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన కెమిస్ట్రీ విభాగం ఆచార్యుడు మధుకర్ గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో మరొకరిని ఇంత వరకూ నియమించలేదు. దీంతో ఆ బాధ్యతలను కూడా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డే చూసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ఆయన రెండు విభాలను పర్యవేక్షించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, కేయూ సీడీసీ డీన్‌గా దూరవిద్యాకేంద్రం జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ఆచార్య వి రామచంద్రం సర్వీస్ గత నెల 31వతేదీతో ముగిసింది. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇదిలా ఉండగా నాలుగురోజుల క్రితం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్.. ఆచార్య రాంచంద్రంను సీడీసీడీన్‌గా బాధ్యతలు నిర్వర్తించాలని కోరారని సమాచారం. దీంతో ఆయన తాత్కాలికంగా ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీనిపై వీసీ, రిజిస్ట్రార్ పనితీరుపై విమర్శలు వస్తున్నాయి.

ఫార్మసీ కళాశాల డీన్‌గా మూడేళ్లకుపైనే నర్సింహారెడ్డి..

కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్‌గా ప్రొఫెసర్ వై నర్సింహారెడ్డి మూడేళ్లుకుపైగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా, డీన్ పోస్టులో రెండేళ్ల పాటు కొనసాగాల్సింటుంది. రొటేషన్ ప్రకారం మిగతా ఆచార్యులను నియమించాల్సింటుంది. అయితే ఫర్ధర్ ఆర్డర్ ఇచ్చి కూడా సంవత్సరం దాటినా ఇప్పటికే డీన్ పోస్టులో మూడేళ్లు దాటింది. దీంతో తాను డీన్‌గా కొనసాగనని అధికారుల దృష్టికి దృష్టికి తీసుకెళ్లినా అతడిని అలాగే కొనసాగిస్తున్నారు. దీంతో నర్సింహారెడ్డి ఆ పోస్టులో అయిష్టంగానే కొనసాగుతున్నారు. ఫార్మసీ కళాశాల డీన్‌గా ప్రొఫెసర్లు గాదె సమ్మయ్య, కృష్ణవేణి అర్హులుగా ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని డీన్‌గా నియమించాల్సింటుంది. కాని ఆ ఇద్దరిలో ఎవరికీ ఇవ్వకుండా నర్సింహారెడ్డినే కొనసాగించడంతో యూనివర్సిటీ అధికారులపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీనిపై ఇప్పటికైనా స్పందించి వెంటనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థులతోపాటు విద్యార్థి సంఘాల నేతలు కోరారు.

ప్రీమాన్‌సూన్ తనిఖీలు నిర్వహించాలి

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


మాట్లాడుతున్న గోపాల్ రావు

హన్మకొండ: వర్షాకాలంలో ప్రీమాన్‌సూన్ తనిఖీలు నిర్వహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లింగ్ కాని సర్వీసులు గుర్తించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కాలిపోయిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. బిల్ స్టాప్, అండర్ డిస్‌కనెక్షన్ సర్వీసులను తనిఖీలు చేయాలన్నారు. గిరివికాసంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించి వాటిపై భారం పడకుండా బదలాయింపు చేయాలన్నారు. రెండు సంవత్సరాలుపై బడిన వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ వాహనాలలోనే ట్రాన్స్‌ఫార్మర్లు తరలించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, రాజుచౌహాన్, డీఈ(ఐటీ)అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అరుదైన కీటకం


నేలపై కదులుతున్న కీటకం


అరుదైన కీటకాన్ని చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

జనగామ: జిల్లా కేంద్రంలోని ఏకశిల విద్యా కళాశాల ఆవరణలో అరుదైన కీటకం బుధవారం ప్రత్యక్షమైంది. డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఈ కీటకాన్ని గుర్తించారు. వయోలిన్‌ను పోలి ఉన్న ఈ కీటకాన్ని 'ది వాండరింగ్ వయోలిన్ మాంటిస్'గా పిలుస్తారని ఆయన పేర్కొన్నారు. ఎండిన ఆకు రూపంలో కనిపించే ఈ కీటకం.. సన్నని కర్ర పుల్ల మాదిరి దేహంతో ఉండి పరిసరాల్లో కలిసి పోతోంది. ఈ కీటకం నేలపై నడుస్తున్న క్రమంలో గాలిలో కదులుతున్న కర్రలా కనిపిస్తోంది. 'తలను 360 డిగ్రీలు సులభంగా తిప్పగల ఏకైక జీవి.. శత్రువును వెనుక నుంచి కూడా చూడగలదు.. ఒకే చెవి ఉన్నప్పటికీ అద్భుతమైన వినికిడి శక్తి కలిగి ఉంటుంది' అని రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మానవ అవాసాల విస్తరణ, పచ్చదనం లోపించడంతో వీటి సంఖ్య తగ్గుతున్నట్లు వివరించారు.

కి'లేడీ'

● దుబాయ్ కరెన్సీతో మోసం..
● అదుపులోకి తీసుకున్న జనగామ పోలీసులు
● ఆలేరు పీఎస్‌లో అప్పగింత


పోలీసుల అదుపులో ఉన్న హీనా

జనగామ: అరబ్ దేశాల కరెన్సీతో ముస్లింలను టార్గెట్ చేస్తూ మోసం చేస్తున్న ఓ కి'లేడీ' (మహిళ)ను జనగామ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సృజన్ కథనం ప్రకారం వెస్ట్ ఢిల్లీ, జేజే కాలనీకి చెందిన హీనా..యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుతో పాటు జనగామ ప్రాంతంలోని ముస్లింలే టార్గెట్‌గా దుబాయ్, సౌదీ అరేబియా కరెన్సీ పేరిట మోసానికి పాల్పడుతోంది. ముందు అరబ్ దేశానికి సంబంధించి ఒరిజినల్ కరెన్సీతో ముస్లింల వద్దకు వెళ్లి.. మార్పి చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకుంటుంది. రూ.2వేల కరెన్సీకి 50 శాతం ఇస్తే సరిపోతుందని నమ్మబలుకుతూ.. అవసరమైతే బ్యాంకులో నోటుకు చెక్ చేసుకోవచ్చని చెబుతుంది. బ్యాంకు అధికారులు ఒరిజినల్ నోటుగా ధ్రువీకరించడంతో.. సదరు ముస్లింలు అరబ్ దేశ కరెన్సీని మార్పిడి చేసుకుంటున్నారు. ఇలా ఒకటి, రెండు సార్లు మార్పిడి అనంతరం... 3వ సారి ఫేక్(దొంగ) నోట్లతో నిట్ట నిలువునా ముంచుతుంది. రెండు సంవత్సరాల క్రితం పట్టణానికి చెందిన ఓ ముస్లిం వ్యక్తి ఇలాగే మోసానికి గురి కాగా పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. మోసపోయిన వ్యక్తి సోదరుడి వద్దకు సదురు మహిళ వచ్చి.. అరబ్ కరెన్సీ మార్చు కోవాలని అడిగిన వెంటనే.. నాటి మోసం గుర్తుకు వచ్చి, పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి హీనాను పీఎస్‌కు తరలించారు. గతంలో ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో హీనాపై కేసు నమోదు కాగా, ఇక్కడి పోలీసులు వారికి అప్పగించారు.

చావు.. సమస్యకు పరిష్కారం కాదు

● సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి

మహబూబాబాద్: చావు సమస్యకు పరిష్కారం కాదని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం అర్థమైన ఆమె కుమారుడు డయల్ 100 ద్వారా సమాచారం ఇవ్వగా వారిని సఖి సభ్యులు కాపాడి జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. ఖమ్మం జిల్లా వైరా మండలం వందనం గ్రామానికి చెందిన వివాహిత, తన కుమారుడు , కుమార్తెతో ఖమ్మం జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నారన్నారు. భర్త పట్టించుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై ఆత్మహత్య చేసుకోవాలని ఖమ్మం నుంచి డోర్నకల్ వరకు రైలులో వచ్చారన్నారు. డోర్నకల్ స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించగా సఖి టీం సభ్యులు కాపాడారన్నారు. ఆ వివాహితకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం ఖమ్మం పంపామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు అశోక్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుట్టిందనే ఆనందం..

● అనాథ పిల్లలకు చేయూత
● రూ. 20వేల విలువైన విద్యాసామగ్రి అందించిన నిరంజన్


అనాథ బాలికలకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న నిరంజన్, కుటుంబ సభ్యులు

హన్మకొండ : హనుమకొండకు చెందిన తన కూతురు సంహిత, అల్లుడు సాయి కిరణ్ దంపతులకు ఆడపిల్ల పుట్టిందనే సంతోషంతో సిరిసిల్లకు చెందిన శ్రీరాముల నిరంజన్, విజయ దంపతులు హనుమకొండ సుబేదారిలోని బాలసదనానికి చెందిన అనాథ పిల్లలకు చేయూతనందించారు. బుధవారం బాలసదనంలో జరిగిన కార్యక్రమంలో 80 మంది బాలికలకు రూ.20 వేల విలువైన నోట్ పుస్తకాలు, స్టేషనరీ, స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు బత్తుల భవాని, జశ్వంత్, జ్ఞానశ్రీ, ప్రజ్వల్, బాల సదన్ సూపరింటెండెంట్ ఎం. కల్యాణి, బాల రక్ష భవన్ కో-ఆర్డినేటర్ కే. శిరీష, డీసీపీఓ పి.సంతోష్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

తొర్రూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని నాంచారిమడూరు గ్రామ శివారులోని రెడ్డి గార్డెన్‌లో జరిగిన ఓ వివాహానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన సాగుతుందన్నారు. ఇలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి డబుల్ ఇంజన్ పాలనను తీసుకురావాలన్నారు. తొమ్మిదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ఎక్కడ అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య, నాయకులు రంగు రాములు, రచ్చ కుమార్, అలిసిరి రవిబాబు, బొచ్చు సురేష్, బొమ్మనబోయిన కుమార్, పైండ్ల రాజేష్, సురేష్, సంతోష్, శివ, భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని బుధవారం ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 2023లో జరిగే ఎన్నికలే కేసీఆర్‌కు చివరివి అన్నారు. బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచెంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఈటలను సన్మానిస్తున్న నేతలు

'నీట్' ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం


జి. వర్షిణి


వివేక్‌రాయ్


ఇ. సాయి


జి. బాలరాజ్

విద్యారణ్యపురి: 'నీట్' (జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష)లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి బుధవారం తెలిపారు.నీట్ -2023లో ఫలితాల్లో జి వర్షిణి జాతీయ స్థాయిలో 226 వ ర్యాంకు సాధించారన్నారు. వివేక్ రాయ్ 257, ఇ సాయి 257వ ర్యాంకులు సాధించి ఎస్‌ఆర్ క్రీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారని తెలిపారు. జి బాలరాజ్ 720 మార్కులకుగాను 657, మాధురిరెడ్డి 638, వివేక్ రాయ్ 636, ఎం సింధు 631, వి సాయి సిద్దార్థ 630, డి శ్రీవర్ష 615, కె వీరేశ్ 604 మార్కులు సాధించారన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ఎస్‌ఆర్ విద్యాసంస్థలకు చెందిన 210 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించే ర్యాంకులు పొందారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరిస్తూ తమ విద్యార్థులకు సృజనాత్మకతతోకూడిన విద్యనందిస్తున్నామన్నారు.

'శివాని' విద్యాసంస్థల విజయభేరి..


ఆశ్రితారెడ్డి


వాసంతి


సాత్వికా


కె.కమల్


సాయి కృష్ణ


మంద హారిక

హసన్‌పర్తి : నీట్ ఎంట్రెన్స్‌లో 'శివాని' విద్యాసంస్థలు విజయభేరీ మోగించాయి. ఏడుగురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. రొంటాల ఆశ్రితారెడ్డి(516/720), చిమ్ముల వాసంతి (514/720), చాతరబోయిన సాత్విక (464/720), కె. ఖమల్(460/720), ఇట్టబోయిన సాయి కిరణ్ (457/720), మంద హారిక (450/720),అకునూరి సుష్మిత (420/720) మార్కులు సాధించారని 'శివాని' విద్యా సంస్థల కరస్పాండెంట్ టి. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం శివానికే సాధ్యమన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ స్వామి, ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి. చంద్ర మోహన్, డైరెక్టర్లు రాజు, రమేశ్, మురళీ, సురేశ్, సంతోష్‌రెడ్డి అభినందించారు.

'షైన్' విద్యార్థుల ప్రతిభ


శ్రీవర్షిణిని అభినందిస్తున్న 'షైన్' విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు

హన్మకొండ : నీట్-2023 ఎంట్రన్స్ ఫలితాల్లో 'షైన్' జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తమ విద్యార్థి జాతీయ స్థాయిలో 510 మార్కులు సాధించి కార్పొరేట్‌కు సమానంగా నిలిచిందని 'షైన్' విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూకల రమి, మూగల రమేశ్ యాదవ్ తెలిపారు. ఎ.శ్రీవర్షిణి జాతీయ స్థాయిలో 510 మార్కులు సాధించిందని తెలిపారు. అలాగే, వస్పియా ఆర్బిన్ 474, ఎస్.రితిక్ కుమార్ 428, బి.శ్రీజ 383, డి.శ్రీజ 365 మార్కులు సాధించారని వివరించారు. వీరితో పాటు 20 మంది విద్యార్థులు 300కు పైగా మార్కులు సాధించారన్నారు. అనంతరం 510 మార్కులు సాధించిన ఎ.శ్రీవర్షిణిని సన్మానించారు. కార్యక్రమంలో షైన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు, కొత్తకొండ శ్రీనివాసన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రెజోనెన్స్' విజయకేతనం


నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో రాజిరెడ్డి

హన్మకొండ : నీట్- 2023 ఫలితాల్లో హనుమకొండలోని 'రెజోనెన్స్' విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారని 'రెజోనెన్స్' విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని బి.శ్రీవర్ష 635 మార్కులు సాధించారని తెలిపారు. ఎం.హృషికేశ్ 580 మార్కులు, వి.మన్విత 579, ఎం.విష్ణుతేజ 571, ఎం.నిఖిత పాండే 562, ఎ.మనోజ్ఞ 553, ఆర్.హిమశ్రీ 549, కె.హిమవర్షిణి 522, జూహా అర్షిన్ 510, జి.శ్రీనిత 505 మార్కులు సాధించారని వివరించారు. 14 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. అన్ని కేటగిరీల్లో కలిపి బీపీసీ విద్యార్థులలో 60 శాతం మందికి ఎంబీబీఎస్‌లో ఉచిత ప్రవేశాలు లభించే అవకాశముందన్నారు. అద్భుత విద్యా ప్రమాణాలతో ప్రతి సంవత్సరం జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్, నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

'నీట్'లో సరయుకు 445 ర్యాంకు


సరయు

కమలాపూర్: మండలంలోని గూడూరుకు చెందిన చిలుముల సరయు 'నీట్'లో 613 మార్కులు సాధించి ఆలిండియా 445వ ర్యాంకు సాధించింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ చిలుముల నాగేశ్వర్‌రావు, కావేరి దంపతుల కూతురు సరయు టెన్త్ హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో చదివి 99 శాతం మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్యలో చదివి 980 మార్కులు సాధించింది. భవిష్యత్‌లో ఎండీ గైనకాలజీ చేయడమే తన లక్ష్యమని సరయు తెలిపారు. కాగా, సరయును యూనివర్సిటీ అధ్యాపకులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం..


ప్రాచిగిల్డకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్ : 'నీట్' ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి బ్రిజ్ గోపాల్, దీపగిల్డ దంపతుల రెండో కూతురు ప్రాచిగిల్డ 65వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. ఎంసెట్‌లో తెలంగాణలో 13వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ప్రాచిగిల్డ 'సాక్షి'తో మాట్లాడుతూ 'నీట్'లో 720 మార్కులకు గాను 710 మార్కులు సాధించాన్నారు. ఎంబీబీఎస్ చదివి మానుకోట జిల్లాలోనే పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తాన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం


దోర్నకల్: మాట్లాడుతున్న డీఆర్ఎం అభయ్‌కుమార్

డోర్నకల్: రైల్వే రంగంలో ప్రయాణికులు, ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ అభయ్‌కుమార్ తెలిపారు. స్థానిక రైల్వే రామాలయం ఆవరణలో వివిధ రైల్వే శాఖల ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సేఫ్టీ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైళ్ల రాకపోకలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సిబ్బంది భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్) కృష్ణారెడ్డి, సీనియర్ డీసీఎం బస్వరాజ్, సీనియర్ డీఓఎం సురేశ్‌రెడ్డి, సీనియర్ సీఎస్ఓ సురేశ్, పాల్గొన్నారు.

రైల్వే భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్ : రైల్వే భద్రత పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి సేఫ్టీ సూచనలు పాటించాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అభయ్ కుమార్ గుప్తా అన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్లోని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయంలో బుధవారం సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి రైల్వే కార్మికులపై ఉందన్నారు. ఈ సందర్భంగా రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, సీనియర్ డీఈఎన్ భాస్కర కృష్ణ సజ్జ, ఏడీఈఎన్ విష్ణుచౌదరి, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాజమౌళి, టీఐ మోహన్ కుమార్, స్టేషన్ మాస్టర్ కనకరాజు, రైల్వే ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.